మార్చి - ఏప్రియల్, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



## సిలువ విలువ



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు నామములో మీ అందరికి నా వందనములు.

ఈ సంవత్సరం 2 నెలలు కాపాడిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు. మీ విశ్వాసము కడవరకు కాపాడుకొనమని సెలవిచ్చిన ప్రభువు మాటలను మనము ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకొనవలెను. ఆసక్తి విషయములో మాంద్యులము కాక, ఆత్మలో తీవ్రత గలవారమై ప్రభువును సేవించవలెను.

ఈ సమయంలో ఫైనల్ ఎగ్జామ్స్ జరుగుచున్నందున చదువుకుంటున్న పిల్లలు ఉన్న ప్రతి ఇంట్లోను తల్లిదండ్రుల హడావుడి, పిల్లల టెన్షన్ చూస్తూ ఉంటాము. పిల్లలకు మంచి మార్కులు రావాలని, వారు వ్రాసిన ఎగ్జామ్స్‌లో జయము కలగాలని దేవునికి నేను చేసే ప్రార్థనయై యున్నది. పరీక్షలు వ్రాస్తున్న పిల్లలకు దేవుడు మంచి భవిష్యత్‌ని ఇవ్వాలని ప్రార్థించండి. ఈ జ్ఞానంతో పాటు వారికి మారుమనస్సు, పాపక్షమాపణ నిశ్చయత కలగాలని మనము దేవునిని వేడుకొనవలెను. ఎప్పుడైతే మన పిల్లలు పాపముల విషయమై పశ్చాత్తాపం కలిగి, క్రొత్తజన్మ అనుభవములోకి వస్తారో తల్లిదండ్రులు నిశ్చింతగా ఉండవచ్చు.

ఈ దినములలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా 40 రోజులు ఉపవాసముండుట క్రైస్తవులలో కొందరికి అలవాటు. అయితే ఉపవాసము ఉండుట తప్పు కాదు కానీ, దానిని ఆచారంగా మార్చి ఉపవాసము లేని వారిని తృణీకరించుట, కేవలం ఆహారం మాత్రమే మాని, ప్రార్థన చేసుకొనకపోవుట, మార్పు చెందుటకు ఏ మాత్రం ఆసక్తిని చూపించక పోవడం సరియైనది కాదు. నిజక్రైస్తవుడు ప్రతిదినము క్రీస్తు సిలువ త్యాగమును ధ్యానించుకుంటూ క్రీస్తు ప్రభువు వంటి మనస్సు కలిగి ఉండుటకు అన్ని విషయములలో ఎదగవలెను.

అట్టి ధన్యత దేవుడు మనకు దయచేయును గాక !

మీ సహోదరుడు.....



మార్చి - ఏప్రియల్, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్వైమాస పత్రిక

## ఈ సంచికలో...


- ఎన్ని తలంపులు? ..... 2
- ఎంతో నమ్మకమైన..... ..... 5
- మీ కోసం (స్త్రీల ప్రత్యేకం) ..... 6
- అందమైన బహుమతి ..... 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 15వ భాగము ..... 11
- గ్రహించలేక (బాలల శీర్షిక) ..... 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ..... 15
- రూపాయి, యూరో, డాలర్, పౌండ్ ..... 17
- సిలువ విలువ ..... 18
- షోమ్రోను కొండ ..... 21
- బైబిల్ క్విజ్-15 ..... 22
- జన్మదిన శుభాకాంక్షలు ..... 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# ఎన్ని తలంపులు ? -బ్రదర్. ఎపఫ్రా

**యెన్నాళ్ళ మట్టుకు మీరు రెండు తలంపుల మధ్య తడబడుచుందురు? 1 రాజులు 18:21**

ఏది సత్యము? దేనిని అనుసరించాలో మనం నిర్ణయించుకోవాలి. జీవితం గురించి అన్ని రకాల దృక్పధములను, అభిప్రాయములను అంగీకరించడం అనేది విశాల హృదయముగాను, సహనముగాను కొందరు ఎంచుతుంటారు. కానీ ఏ మనుష్యుడు రెండు భిన్నమైన అభిప్రాయములను సమానముగా గౌరవించలేడు. అతని హృదయం రెండు తలంపులతో ఎప్పుడూ నెమ్మదిగా ఉండలేదు. ఈ నవ నాగరిక సమాజములో మనుష్యులు పూర్తిగా వ్యాపార దృక్పధంతో జీవించుట వలన మంచిని మంచి అని, చెడుని చెడు అని చెప్పలేని నిస్సహాయమైన స్థితిలో కొట్టుమిట్టాడుతూ బ్రతుకుతున్నారు.

ఒకానొక రోజున దైవభక్తుడైన ఏలియా రెండు ఆలోచనలతో ప్రజలు ఉండడం గమనించాడు. ఒక ఆలోచన భూమ్యాకాశములను సృజించిన యెహోవా దేవుడు అని, మరియొక ఆలోచన మనుష్యులు ఏర్పరచిన బయలు అనే దేవత దేవుడు అనే తడబాటు ఎరిగి వారిని ఆ ఇబ్బందికరమైన స్థితి నుండి విడిపించాలని కోరుకోవడం జరిగింది. ఈ దినములలో ఇలాంటి బాధ్యత కలిగిన భక్తులైన వారు కనిపించడం అరుదు. కేవలం మనుష్యులను సంతోషపరచడానికి ఉన్న శ్రద్ధ వారిలోని పొరపాటు లేక తడబాటుని హెచ్చరించడంలో కనబడదు. ఎవరు ఎలాంటి ఆలోచనలతో ఉన్నా వారిని సమర్ధించడమే ధ్యేయంగా పెట్టుకున్న ఎంతో మంది పెద్దలను, బోధకులను చూస్తున్నాము. దీనివలన ప్రజలకు స్పష్టమైన ఆలోచనా విధానం లేకుండా పోతుంది. ఆనాటి ఏలియా ప్రజలందరి దగ్గరకు వచ్చి యెహోవా దేవుడైతే ఆయనను సేవించుడి, బయలు దేవుడైతే వాని ననుసరించుడి అని సూటిగా ఒక మాట చెప్పాడు. వారిలో ఒక్కరు కూడా సమాధానం చెప్పలేదు ఎందుకంటే రెండు తలంపుల మధ్య వారు ఎటూ తేల్చుకోలేకపోవడం. ఏలియా అక్కడున్న జనులందరితో మాకు రెండు ఎడ్లను ఇవ్వండి, బయలుదేవతను ఆరాధించే 400 మంది ప్రవక్తలు ఉన్నారు. వారు ఒక ఎద్దును తునకలుగా చేసి కట్టెల మీద పెట్టవలెను. ఆలాగు చేసి వారి దేవుడికి ప్రార్థన చేయగా అగ్ని వచ్చి దానిని దహించాలి. నేనును మరియొక ఎద్దును ఆలాగున సిద్ధపరచి యెహోవాకు ప్రార్థన చేస్తాను. ఏ దేవుడు అగ్నిని పంపించి, వీటిని దహింపచేస్తాడో ఆయనే నిజమైన దేవుడని నమ్మండి, మీ రెండు తలంపుల ధోరణిని విడవండి. దానికి ప్రజలందరూ సరే అని ఒప్పుకున్నారు. అప్పుడు బయలు ప్రవక్తలు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎంత కేకలు వేసినా, వారి శరీరములు కోసుకున్నప్పటికి అగ్ని దిగి రాలేదు. ఆ తరువాత ఏలియా ప్రార్థన చేయగా ఆకాశం నుండి

అగ్ని దిగి వచ్చి వాటిని దహించి వేసింది. అక్కడ ఉన్న జనులందరూ యెహోవానే దేవుడు అని బిగ్గరగా కేకలు వేయటం జరిగింది.



రెండు తలంపులు మనకి ఏ మాత్రము క్షేమమును ఇవ్వలేవు. రెండు లేక అనేక తలంపుల స్వభావం నుండి మనం ఖచ్చితంగా బయటపడాలి. రెండు తలంపులు మనలను నటన, వేషధారణ కలిగిన వారిగా కూడా మార్చివేయవచ్చు. ఇవి ఎంతో ప్రమాదకరమైనవి.

ఇంచుమించుగా 2000 సం॥లకు పూర్వము నూతనముగా ఏర్పరచబడిన ఆది సంఘములో ఏకమనస్సుతో, ఏకాత్మతో దేవునిని సేవిస్తూ సంతోషంగా ఉండేవారు. ఒకరోజు వారందరూ కలసి ఒక నిర్ణయం తీసుకున్నారు. ఆయన ప్రేమ సందేశం అనగా నిత్య జీవపు మార్గం ప్రపంచమంతా ప్రకటించాలి గనుక మనకి కలిగిన స్థిర చరాస్థులన్నీ అమ్మివేసి ఒక చోట ఉంచుకొని ఎవరి అక్కర కొలది వారు ఉపయోగించుకుందాం. అందరూ దానికి సమ్మతించారు, వారందరూ ఒకే ఆలోచనతో ఈ పని జరిగించారు.

అయితే వారిలో అననీయ, సప్పీరా అనే భార్యా భర్తలు రెండు తలంపులతో అనగా 1. అమ్మి ఇవ్వాలని 2. భవిష్యత్ గురించి దాచు కోవాలని. ఈ రెండింటి మధ్య తడబడుచూ కొంత దాచుకొని, మిగిలినది సంఘనాయకుడైన పేతురు వద్దకు తెచ్చినట్లుగా బైబిల్ గ్రంథంలో వ్రాయబడి ఉంది. అప్పుడు పేతురు అననీయ అనే వ్యక్తితో పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను నీ హృదయమును ఎందుకు ప్రేరేపించాడు? నీ దగ్గర ఉన్నప్పుడు అది నీదే గదా అని అనడం జరిగింది. నీవు దేవునితోనే అబద్ధమాడితివి అనగా ఈ మాటలు వింటూ అననీయ ప్రాణం విడిచాడు. ఈ సంఘటన జరిగిన 3 గంటల తరువాత అతని



భార్య రాగా, పేతురు ఇంతకే అమ్మితిరా అని అడుగగా ఆమె కూడా ఇంతకే అని చెప్పింది. అప్పుడు పేతురు ప్రభువు ఆత్మను శోధించు టకు ఎందుకు ఏకీభవించి తిరి? అనగా ఆమె కూడా పేతురు పాదముల దగ్గర పడి చనిపోయింది. రెండు నిండు ప్రాణములు బలి కావడానికి కారణము రెండు తలంపులు. మనుష్యుడు దేవునికి, సిరికి దాసుడిగా ఉండలేడు. లేక రెండింటిని ప్రేమించలేడు (మత్తయి 6:24) అని బైబిల్ గ్రంథములో వ్రాయబడి ఉన్నది.

ప్రియ చదువరీ! నీవెవరివైనా సరే దేవునిని ఆరాధించుటలో కానీ, ఆయన వాక్యమును అనుసరించుటలో కానీ రెండు తలంపులతో జీవించడం ఏ మాత్రం మంచిది కాదు. ఈ దినములలో మనుష్యులు మానవ జ్ఞానంతో దైవజ్ఞానమును అడ్డగిస్తూ మనుష్యులను సంతోషపరుచుట కొరకు రెండు లేక అంతకంటే ఎక్కువ తలంపులతో బ్రతకడం శోచనీయం. **యేసుక్రీస్తు నిజదేవుడు ఆయన తప్ప వేరే మార్గము లేదు** అనేది బైబిల్ గ్రంథ సారాంశము. వేరొక తలంపుకు అవకాశమే లేదు. కనుక రెండు తలంపుల మధ్య ఊగిసలాడే ధోరణికి స్వస్తి చెప్పి, ఆయన మార్గములో సాగిపోదాం.

అట్టి కృపను దేవుడు మనకి అనుగ్రహించును గాక !

# ఎంతో నమ్మకమైన ....

గౌరవనీయమైన స్థానంలో ఉన్న ఒక స్త్రీ కుక్కని పెంచుకుంటూ ఉండేది. దాని మీద ఆమెకి ఎంతో అభిమానం. ఎందుకంటే ఆ స్త్రీ తన చిన్న బిడ్డను విడిచి, బయటి పనులు చూచుకొని వచ్చినప్పటికి, ఆ కుక్క ఎంతో శ్రద్ధగా కాపలా కాస్తూ ఉండేది. ఇలాగున అనేకసార్లు జరుగుచూ వచ్చింది.

**ఒక దినం ఊహించని దుఃఖకరమైన సంఘటన :-**

యథావిధిగా ఆ స్త్రీ తన చిన్నబిడ్డను నమ్మకమైన కుక్క దగ్గర విడిచి, షాపింగ్‌కి వెళ్ళింది. తిరిగి వచ్చేసరికి అంతా అయోమయం అయ్యే దృశ్యం కనిపించింది. ఆ చిన్న బిడ్డ కనిపించలేదు, మంచం చిందరవందరగా ఉంది. బట్టలు రక్తపు మరకలతో అక్కడక్కడ కొన్ని ముక్కలు పడి ఉన్నాయి. గదిలో ఉన్న ఈ దృశ్యమును చూచి ఆ తల్లి నిర్ఘాంత పోయింది. బాబు కోసం చూస్తుండగా ఆ మంచం క్రింద నుండి రుచికరమైన భోజనమును తిన్నట్లుగా మూతిని నాక్కుంటూ వస్తున్న కుక్క కని పించి ంది. వెంటనే ఈ దృశ్య మును చూచిన ఆ స్త్రీ తన బిడ్డని ఆ కుక్కే తిని ఉంటుందని ఊహించుకొని,ఇంకేమీ ఆలోచించకుండా, దుడ్డు కర్ర ఒకటి తీసుకొని ఆ కుక్కని కొట్టి చంపి వేసింది. ఇంతలో గదిమూలలో నుండి వస్తున్న చిన్న బాబు సురక్షితంగా ఉండడం కొంచెం దూరంలో నక్క శరీరం ముక్కలు ముక్కలు చేయబడి ఉండడం కనిపించింది. అది చూస్తుంటే చిన్న బాబుని రక్షించడానికి కుక్క ఎంతో పోరాడినట్లుగా కనబడుతుంది.




వాస్తవం ఆ స్త్రీని ఎంతో కలిచివేసింది. కుక్క చిన్నబిడ్డను కాపాడడానికి, ప్రాణానికి తెగించినట్లుగా అర్థం అవుతుంది. ఇప్పుడు తన కోపమును, అహమును వెనుకకి తీసుకుందామన్నా సమయం మించిపోయింది. జరగకూడని అనర్థం జరిగిపోయింది. నమ్మకమైన కుక్కని చంపివేసింది.

ఇలా ఎన్నిసార్లు తప్పుగా అర్థం చేసుకొని మన కఠినమైన మాటలతో, అజ్ఞానపు పనులతో ఎదుటి వారి వ్యక్తిత్వమును చంపుతున్నామో కదా! కొంచెం సహనము జీవితకాలమంతా బాధపడే తప్పులు చేయకుండా మనలను కాపాడుతుంది.

# మీ కోసం

**-సిస్టర్ విజయ**

యేసుప్రభువు సిలువ వేయబడుటకు వెళ్తూ అంత శ్రమలోనూ అక్కడ ఉన్న స్త్రీలను చూచి, ఎంతో ప్రేమతో పలికిన మాట. **- యెరూషలేము కుమార్తెలారా నా నిమిత్తము ఏడ్వకుడి, మీ నిమిత్తమును మీ పిల్లల నిమిత్తమును ఏడ్వుడి - లూకా 23:28**



క్రైస్తవ జీవితం ఒకపోరాటం, అనుక్షణం సాతాను మన మీద దాడి చేస్తూ ఉంటాడు. విశ్వాసం, ప్రార్థన, సాక్ష్య జీవితముల నుండి ప్రక్కకు తొలగించాలని మనలను కవ్విస్తూ ఉంటాడు. దేవుని వాక్యమును ధరించి విశ్వాసం, ప్రేమ, నిరీక్షణ నిండిన హృదయము లతో ప్రార్థిస్తూ రక్షణ ప్రాకా రములలో నిలిచి ఉన్నప్పుడు అపవాది మనలను ఏమియు చేయలేడు. దేవుని సన్నిధిలో వేడుకొనుట వలన మాత్రమే ప్రతి స్థితి నుండి పైకి లేవనెత్తబడి, హృదయములో నెమ్మది పొందగలము. అందుకే ఆయన మన నిమిత్తము, మన పిల్లల నిమిత్తము ఏడ్వమని చెప్పారు.

మనము సిలువలో ఆయన పొందిన శ్రమ, వారు ఆయనకు చేసిన అవమానములను, గాయములను బట్టి హృదయంలో ఆవేదన చెందుతూ, బాధపడతాము కానీ మన జీవితములో నిందలు, అవమానములు, శ్రమలు, కలిగినప్పుడు ఎంతో కృంగిపోతాము. ఆ సమయంలో సిలువలో శ్రమ పొందిన ఆయనను జ్ఞాపకం తెచ్చుకుని ఆయన సన్నిధిలో వాటి నిమిత్తము వేడుకొని, ధైర్యం తెచ్చుకొని విశ్వాసంతో ముందుకి వెళ్ళాలి.

దేవుడు యేసుప్రభువుని ఈ లోకములోనికి పంపుట ద్వారా ఆయన మన యందు ఉంచిన ప్రేమ ప్రత్యక్ష పరచబడెను. కుటుంబములలోని వారే మన నిమిత్తము ప్రాణము పెట్టడానికి ఇష్టపడని స్థితిలో ఆయన మన నిమిత్తము ప్రాణము పెట్టెను గనుక దీని వలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. ఆ విధముగానే సంఘమైయున్న క్రీస్తు శరీరములో సహోదరుల నిమిత్తము ప్రాణము పెట్టబద్దులమైయున్నాము. ప్రాణము పెట్టేంతగా కాక పోయిననూ, కనీసం తోటివారిని కూడా సహించుకొనని స్థితిలో నేడు మనలో అనేకులము ఉన్నాము. తోటి వారిని సహించుకోలేక, క్షమించలేక నేను దేవుని ప్రేమిస్తున్నాను అని

చెప్పుకుంటే మనలను మనము మోసపరుచుకున్నట్లు. అందుకే సిలువ మీద శ్రమ పొందారు అని ఆయన నిమిత్తం ఏడ్చేవారముగా కాక మన కొరకు ఆయన చూపిన ప్రేమను ఇతరులకు చూపుటకు, సహించుకునే మనస్సు కొరకు దేవుని సన్నిధిలో వేడుకొనవలెను.

**మీ నిమిత్తము ఏడ్వుడి :-**

మొట్టమొదటగా వ్యక్తిగతంగా ఆత్మీయజీవితంలో కలుగుచున్న తొందరలు కూడా అనేకం. అపవాది గర్జించు సింహము వలె ఎవరిని మ్రింగుదునా? అని తిరుగులాడు చుండగా, వాడి నోటి నుండి తప్పించబడి, క్రీస్తు సరళత నుండి తప్పిపోకుండా కాపాడబడు నట్లుగా దేవుని సన్నిధిలో ప్రార్థించాలి. **మరియు ఆదాము మోసపరచబడలేదు కాని స్త్రీ మోసపరచబడి అపరాధములో పడెను అని 1 తిమోతి 2:14లో చెప్పబడినట్లుగా** హవ్వ దేవుడు తినవద్దు అని చెప్పిన పండుని ఆజ్ఞను మీరి తినునట్లుగా చేసిన శరీరాశ, నేత్రాశ, జీవపుడంబముల నుండి మనము విడిపించబడాలని దేవునిని వేడుకోవాలి.

**"జ్ఞానవంతురాలు తన ఇల్లు కట్టును"** అన్న మాట ప్రకారము మన కుటుంబములు దేవునిలో కట్టబడాలంటే ఆయన అనుగ్రహించు జ్ఞానము మనకు అవసరమై యున్నది. జ్ఞానము దేవుని అడుగవలెను. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయ చేయువాడు అనేకసార్లు మనము ఊహించని సంఘటనలు పెనుగాలుల వలె మన మీదకు వచ్చి ఉక్కిరి బిక్కిరి చేస్తూ ఉంటాయి. కుటుంబములలోని ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు, మారుమనస్సు లేని కుటుంబ సభ్యుల సమస్యలు కావచ్చు. ఏ సమస్య, ఏ విధంగా కలిగిననూ దేవుని సన్నిధిలో మన నిమిత్తము వేడుకొనుట ద్వారా నిశ్చయముగా ఆయన జ్ఞానమును, కృపను, శోధనలలో దయచేస్తారు.

**మీ పిల్లల నిమిత్తము ఏడ్వుడి :-**

దేవుడు మనకి అనుగ్రహించిన మన పిల్లల యొక్క జీవితముల కొరకు ఆయన సన్నిధిలో వేడుకొనవలసిన తల్లులమై ఉండాలి.

బైబిల్ గ్రంథములో ఒక స్త్రీని మనము చూచినప్పుడు ఆమె పేరు వ్రాయబడలేదు కానీ తూరు సీదోనుల ప్రాంతం నుండి వచ్చిన కనాను స్త్రీ అని చెప్పబడినది. ఆమె కుమార్తె దయ్యము పట్టి బహుబాధ పడుచుండగా ఆమె యేసుప్రభువు వద్దకు వచ్చి దావీదు కుమారుడా కరుణింపుము అని కేకలు వేయుచున్నది. అయిననూ యేసయ్య ఆమెతో ఒక్కమాట కూడా చెప్పక ఇశ్రాయేలు ఇంటి వారై నశించిన గొర్రెల యొద్దకే గాని మరి యెవని యొద్దకు నేను పంపబడలేదు అనెను. అయినా ఆమె విడువక వచ్చి ఆయనకు మ్రొక్కి

ప్రభువా సహాయం చేయమని వేడు కుంది. అందుకు ఆయన పిల్లల రొట్టె తీసికొని కుక్క పిల్లలకు వేయుట యుక్తము కాదు అనెను. ఆమె కుక్కపిల్లలు కూడా తమ యజమానుల బల్ల మీద నుండి పడు ముక్కలు తినును గదా! అని చెప్పెను. అప్పుడు యేసు అమ్మా! నీ విశ్వాసము



గొప్పది, నీవు కోరినట్టే నీకు అవును గాక అని ఆమెతో చెప్పెను. ఆ గడియలోనే ఆమె కుమార్తె స్వస్థత నొందెను.

చూశారా! ఆ స్త్రీ కుక్కపిల్లలు అని అన్నా కానీ విడువక దేవుని సన్నిధిలో వేడుకుంటూనే ఉన్నది. ఆమె కన్నుల ముందు తన కుమార్తె బాధ ఒక్కటే కనబడుచున్నది. దాని నుండి విడిపించబడాలనే తపన దేవుని నుండి గొప్ప స్వస్థతను పొందుకునేలా చేశాయి. ఇక్కడ దేవునికి సహాయం చేయకూడదు అనే మనస్సు కాదు కానీ, ఆమె యొక్క విశ్వాసమును, గోజాడే స్థితిని పరీక్షించి, ఒక గొప్ప అద్భుతమును దేవుడు జరిగించారు.

ప్రియ సహోదరీ! సిలువలో శ్రమపడుతు కూడా మన కుటుంబముల కొరకు, పిల్లల కొరకు ఎంత శ్రద్ధ, ప్రేమని కలిగి ఉన్నారో కదా! ఇట్టి ప్రేమ మన కుటుంబములో సంఘములో కనుపరుస్తూ, మన అవసరతల కొరకు దేవుని సన్నిధిలో వేడుకునే వారిగా ఉందాము.

అట్టి కృపను దేవుడు మనకు దయచేయును గాక!

# అందమైన బహుమతి

ఒక భర్త తన మ్యారేజ్ డే సందర్భంగా అందమైన బహుమతిని తన భార్యకు ఇవ్వాలని ఒక గిఫ్ట్ షాప్‌కి వెళ్ళి అక్కడ ఉన్న గిఫ్ట్ ఆర్టికల్స్ అన్నింటిని చూస్తూ ఉన్నాడు. సడన్‌గా అతని దృష్టి ఒక అందమైన టీ కప్పు మీద పడింది. దానిని తీసుకు వెళ్తే అతని భార్య మెచ్చుకుంటుందని అక్కడ ఉన్న సేల్స్‌గర్ల్‌ని అడిగి తీసుకున్నాడు.

అంతలో ఆ టీ కప్పు ఈ విధంగా మాట్లాడసాగింది.

నేను ఇంత అందమైన కప్‌గా మారడానికి ఎన్ని కష్టాలు పడ్డానో చెప్పకపోతే మీకు అర్థం కాదు అని మొదలు పెట్టింది.

1. ఒకప్పుడు నేను ఎర్రని మట్టి ముద్ద వలె ఉండేదానిని. నా యజమాని నన్ను చేతిలోకి తీసుకొని ముద్దగా చేసి బాగా ఎత్తి పైకి క్రిందకు పడవేసి, అటూ ఇటూ నలుపుతూ ఉన్నప్పుడు నన్ను వదిలెయ్ అని అరిచాను. యజమాని నవ్వి ఇప్పుడే కాదు అన్నాడు.

2. తరువాత నన్ను ఒక చక్రం మీద పెట్టి గిర గిరా త్రిప్పుతూ ఉంటే వద్దు, నేను తిరగలేను అని విసుగ్గా అన్నాను. అయినా నా యజమాని నన్ను విడిచిపెట్టలేదు.

3. తరువాత నన్ను ఓవెన్‌లో పెట్టాడు. అంత వేడిని నేను ఎప్పుడూ భరించలేదు. ఎందుకు నన్ను కాల్చి, ఇబ్బంది పెడుతున్నాడు అని ఆశ్చర్యపోయి, ఒవెన్ తలుపు తట్టాను. ఇప్పుడే కాదు అనే సమాధానం వచ్చింది కానీ తలుపు తెరవబడలేదు.

4. చివరికి తలుపు తీసి, నన్ను బయట షెల్ఫ్‌లో ఉంచినప్పుడు నేను చల్లబడ్డాను. హమ్మయ్య ఇప్పుడు కొంచెం ఫర్వాలేదు అనుకునేంతలో ఒక బ్రష్ తీసుకొని రుద్దుతూ రంగులతో నన్ను నింపాడు. ఆ రంగుల వాసన చాలా ఇబ్బందికరంగా ఉండి, నేను చచ్చిపోతాను వద్దు వద్దు అని ఏడ్చాను. అయినా అప్పుడే కాదు అనే సమాధానం వచ్చింది. మరల వెంటనే నన్ను తీసుకువెళ్ళి ఒవెన్‌లో పెట్టాడు. కానీ మొదట ఉన్నంత వేడి లేదు.

ఇది రెండవసారి నన్ను వేడి చేయడం, నేను ఏమి అరిచిననూ ఉపయోగం ఉండదు అని నాకు తెలుసు ఎందుకంటే ఇప్పటికీ అనేకసార్లు అడిగాను, ప్రాధేయపడ్డాను, విసుక్కున్నాను, ఏడ్చాను. ప్రతిసారీ నేను అతనిని చూచినప్పుడెల్లా ఇప్పుడు కాదు అని తల ఊపడం మాత్రమే కనపడేది.

ఇంక నాకు ఎలాంటి ఆశ లేదు, నా మాట వినడు అని నేను గ్రహించి మౌనంగా ఉన్నాను. ఒక గంట తరువాత నన్ను బయటకు తీసి, షెల్ఫ్‌లో ఉంచాడు. మరల గంట తరువాత అద్దము తీసుకువచ్చి నా ముందు పెట్టి, “నిన్ను నీవు చూసుకో” అని చెప్పినప్పుడు అరె నేను కాదు, నేను నేనుగా లేను కానీ అందమైన దానిగా తీర్చిదిద్ద బడ్డాను. నేను చాలా అందంగా ఉన్నాను అని అనుకున్నాను. అప్పుడు నా యజమాని నేను నీకు ఒక విషయమును గుర్తుచేయాలి. నేను నిన్ను మడిచి, కొడుతూ మృదువుగా చేసి వదిలేస్తే నీవు ఎండిపోతావు, ఉపయోగం ఏమీ ఉండదు. అలాగే చక్రం మీద పెట్టి నిన్ను త్రిప్పకపోతే, నువ్వు విరిగిపోయే దానివి. నిన్ను ఒవెన్‌లో, ఆ వేడిలో ఉంచకపోతే నీ షేప్ బీటలు వారుతుంది. నీకు పెయింట్స్ వేయకపోతే అందంగా కనిపించవు. మరల నిన్ను ఓవెన్‌లో పెట్టకపోతే అనేక దినములు ఆ పెయింట్స్ నిన్ను అంటి ఉండవు. ఇప్పుడు నువ్వు ఒక పరిపూర్ణమైన వస్తువువి.

ఆయన మన పట్ల ఏమి చేయనై యున్నారో అది ఆయనకు తెలుసు, ఆయన కుమ్మరి, మనము మంటి వంటి వారము. ఆయన మనలను ఆయన ఉద్దేశ్యములకు అనుగుణంగా మలచి, ఆయనకు ఇష్టమైన పాత్రలుగా చేసి, ఆయన కనికరము, దయ కలిగి అన్ని విషయములలో పరిపూర్ణులగునట్లుగా చేస్తారు.

ప్రియమైన వారలారా! జీవితములో అనేక శోధనలు, శ్రమలు, సమస్యలు, ఇబ్బందులు మనకి సంభవించవచ్చు. అయితే ఆ కప్పు ఏ విధంగా బాధపడిందో మనం కూడా అలాగే బాధపడుతూ ఉంటాము కానీ మన జీవితంలో దేని కొరకు ఇవన్నీ జరుగుచున్నాయో, అర్థమైతే మనము వాటన్నిటిని సహించి, ఆయన కోరుకున్న పాత్రగా మారడానికి ఇష్టపడతాము.

చందా వివరములు
**సంవత్సర చందా : రూ. 50/-లు.**
**జీవితకాల చందా : రూ. 1000/-లు.**
**విదేశములకు : సంవత్సరమునకు US $ 20.**

పంపవలసిన మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 15వ భాగము**



మంచి దేహ దారుఢ్యము గలవాడై పరిశుభ్రమైన బట్టలు ధరించిన ఈ యౌవన సాధువును చూచినపుడు అనేకమంది ఆకర్షితులై ఆయన ప్రసంగములకు చెవియొగ్గారు. సాధారణంగా చాలమంది సాధువులు యౌవనులు కారు, పరిశుభ్రంగా ఉండరు. గనుక సుందర్‌ని చూచిన ప్రజల ప్రతిస్పందన మొదటిలో ఎంతో అనుకూలంగా ఉండేది. కొన్నిసార్లు సుందర్ ప్రసంగించక ముందే ఆయన అడగక పోయినా కూడా భోజనం పెడుతుండే వారు. తాను భిక్షమెత్తకూడదని సుందర్ నిర్ణయించుకున్నాడు. తన ముందు పెట్టిన దానిని తినేవాడు. ఎవరు తనను భోజనమునకు పిలవలేదంటే పస్తు ఉండేవాడు. తన అవసరతలు తీరడానికి సుందర్ దేవునినే నమ్ముకున్నాడు.

ఆయన ప్రసంగం చేయడం ప్రారంభించి యేసుని గూర్చి చెప్పగానే ప్రజల ప్రతిస్పందనలో ఎంతో మార్పు వచ్చేది. ఇప్పటికే ఉన్న హిందూదేవతల జాబితాలో యేసుని కూడా కలుపుకోవాలి కాబోలని కొందరు తలంచారు. యేసుక్రీస్తుని తాను కళ్ళారా చూచానని ఆయన తనను పూర్తిగా మార్చారని, నిరాశ నిస్పృహలతో నిరీక్షణ లేకుండా ఉన్నప్పుడు సంతోష సమాధానములు ఇచ్చారని సుందర్ చెప్పుచున్నప్పుడు ప్రజలలో ఏదో తాత్కాలికమైన ఆసక్తిని రేకెత్తించడం తప్ప పెద్ద ప్రభావం చూపలేదు. యౌవనుడుగా ఉన్న ఈ సాధువు ఇప్పటికే సర్వసంగ పరిత్యాగి అయినాడు గనుక అతనికి భోజన వసతి యేర్పాటు చేస్తే పుణ్యము అనే భావం కూడా ప్రజలలో ఉండేది.

సుందర్ ప్రసంగాలు వినుచున్న వారిలో అతడు క్రైస్తవుడయ్యాడని తెలియనివారు సర్వస్వమును చివరకు తన కులము కూడా విడిచిపెట్టిన సుందర్‌ను గౌరవించారు. అతడు క్రైస్తవుడని తెలిసిన తరువాత మాత్రం పరిస్థితి భిన్నంగా ఉండేది. క్రైస్తవుడా! వెలివేయబడిన వారి మధ్య నుండి పాశ్చాత్య దేశమునకు చెందిన ఈ మతమును స్వీకరించిన వాడా! క్రైస్తవ సాధూజీనా! చంపేయండి, వెళ్ళగొట్టండి అనేవారు. ఒక గ్రామం నుండి మరియొక గ్రామానికి తిరుగుచూ, ఎన్నెన్నో రాత్రులు పాడుబడిన గుడిసెలోనో, లేదంటే ఏ చెట్టు క్రిందనో సుందర్ పండుకోవలసి వచ్చేది. ఇలాంటి ఒకానొక రాత్రి వేళ ఎంతో అలసిపోయి

ఆకలితో నున్న సందర్భంలో తన మీద తనకే జాలివేసి కృంగిపోయే శోధనకు లొంగిపోయే స్థితికి వచ్చాడు సుందర్. అయితే అకస్మాత్తుగా అతని హృదయం ఎంతో సంతోషంతో నిండిపోవడంతో గొంతెత్తి దేవుని స్తుతిస్తూ పాడనారంభించాడు. ఎన్నో సంవత్సరముల తరువాత ఈ సంఘటన గుర్తుచేసుకొని చెప్పేటప్పుడు అయిష్టంగానే చిరునవ్వు చిందించేవాడు సుందర్. పాటలు పాడగల స్వరం తనకు లేదు గనుక తన సంగీతం విన్న గ్రామస్తులు యేమనుకొంటారోనని ఆశ్చర్యపడ్డాడు. ఏమైనప్పటికిని అతని స్తుతి పాటలు వారిలో కొందరిని మేల్కొల్పాయి, కాగా సుందర్ కొంతసేపు పాడిన తరువాత సంగతేమిటో చూద్దామని వారిలో ఇద్దరు అతని యొద్దకు వచ్చారు. దినమంతా తినడానికి ఏమి దొరకక పోవడంతో ఆకలి వలన నిద్ర పట్టక పోయినప్పటికిని తనకెంతో సంతోషంగా ఉండడంతో పాడలేకుండా ఉండలేక పోయానని వారితో చెప్పాడు. ఎంతో ఆకలిగా ఉన్నవాడు అంత సంతోషంగా ఉండగలడనేది వారికి అర్థం కానప్పటికిని సుందర్ తనకు నిద్ర పట్టక పోవడానికి గల కారణమును చెప్పినప్పుడు వారెంతో విచారించి సర్వసంగ పరిత్యాగం చేసిన వానికి మా గ్రామంలో ఇలాంటి దుస్థితి యేర్పడిందని అది తమకి ఎంతో అవమానమని భావిస్తూ మాకు ఈ విషయం తెలియదండి అని క్షమాపూర్వకంగా చెప్పి వెనువెంటనే గ్రామానికి వెళ్ళి భోజనం తెచ్చి వడ్డిస్తే సుందర్ కృతజ్ఞతతో ఎంతో సంతోషంగా తిని దుప్పటి ముసుగు తన్ని గాఢ నిద్రలోకి జారుకున్నాడు. ఈ సందర్భంలో తన భోజనం కోసం అప్రయత్నంగానే పాడాడు సుందర్. తన గ్రామంలో తనకి ఎలాంటి స్వాగతం లభిస్తుందోనని భయపడుతూనే అడుగుపెట్టాడు. మొదట్లో అతని తండ్రి సుందర్ ముఖమును చూడడానికి కూడా ఇష్టపడలేదు. ఆ తర్వాత ఆయన ముఖంలో చిరునవ్వే కరువైంది. క్రైస్తవుడవడం ద్వారా కుటుంబమునకు అవమానం తెచ్చావని నిందించాడు. అంతే కాక సుందర్ రాత్రి వేళ మాత్రమే ఇంటికి వచ్చి మరుసటి దినం తెల్లవారక ముందే వెళ్ళిపోవాలని ఆజ్ఞాపించాడు. ఇంటివారు భోజనం చేస్తున్నప్పుడు మిగిలిన వారికి అందరికి దూరంగా సుందర్ తనకు తానుగా ఎక్కడ కూర్చోవాలో కూడా తండ్రి చెప్పాడు. అప్పుడు తండ్రి వచ్చి భోజనం వడ్డించేవాడు. పాత్రను పైకెత్తి సుందర్ దోసిట్లో మంచినీళ్ళు పోసేవాడు చేతులు చాపు అని తండ్రి గర్జించేసరికి తాను ఏమి చేయాల్సింది సుందర్‌కి అర్థమైంది. దోసిలి విప్పితే త్రాగడానికి నీళ్ళు పోస్తారని గ్రహించాడు సుందర్. నీళ్ళు త్రాగడానికి ఎలాంటి పాత్రను సుందర్‌కి ఇచ్చేవారు కారు. అతడు వాటిని అపవిత్రం చేస్తాడని చెప్పేవారు.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)

(సవరణ :– గడిచిన సంచికలో ఒకే పేజి రెండు సార్లు ప్రింట్ అయ్యిందని, గమనించగలరు)



# "గ్రహించలేక"

Hai children ఎలా ఉన్నారు? బాగా చదువుతున్నారా? Exams దగ్గరకు వస్తున్నాయి కదా! బాగా prepare అవుతున్నారా? మీరు మంచి marks తెచ్చుకుని దేవునికి మహిమ తేవాలని జ్ఞాపకం చేస్తున్నాను. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తుంటే వారికి మంచిపేరు తేవడం ఎంతైనా మీ కర్తవ్యం కదా! కొందరికి తల్లిదండ్రుల encouragement లేక financial problems వలన చదువుకోలేక బాల కార్మికులుగా మిగిలిపోతున్నారు. మీకివ్వబడిన అవకాశములను బట్టి దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించండి.

Railway station లో ..... రాజు, లత ఏ train ఎక్కాలో తెలియక పరిగెడుతున్నారు. అక్కడ ఒక వ్యక్తి black coat వేసుకుని ఇద్దరితో మాట్లాడుతుంటే ... sir, ఈ train ఎక్కడికి వెళుతుంది?" అని రాజు ప్రశ్నించెను. "మీరు ఎక్కడికి వెళ్ళాలి?" రాజు చెల్లి వైపు చూస్తూ "mumbai వెళ్ళాలండి" అన్నాడు. ఆ వ్యక్తి వారిని doubtగా చూస్తూ, "ఇలా వెళ్లి ఆ రెండో ప్లాట్ ఫాం మీద ఉన్న train ఎక్కండి" అన్నాడు, అంతే ... రాజు గమ్యం తెలిసిన వాడిలా చెల్లెలి చెయ్యి పట్టుకుని సంతోషంగా train ఎక్కి సీటులో కూర్చుని కదులుతున్న train లోంచి బయటికి చూస్తున్నాడు. లత కూడా train ఎక్కినందుకు సంతోషంగా అన్నయ్య ప్రక్కనే కూర్చుంది. కానీ మనస్సులో ఏదో భయం వెంటనే "అన్నయ్యా! మనం తప్పు చేస్తున్నామేమో అనిపిస్తుంది. అలాంటి పిచ్చి ఆలోచనలు ఏమీ పెట్టుకోవద్దు. మనం చేస్తున్నది నాకు మంచిదే అనిపిస్తుంది.

Ticket collecter రాజు వాళ్ళ కంపార్ట్‌మెంట్ పరిశీలనగా చూస్తూ లత ప్రక్కనే కూర్చున్నాడు. "మీ పెద్దవాళ్ళు ఎవ్వరూ రాలేదా?" అని రాజుని ప్రశ్నించాడు. రాజు, "అదీ .. అదీ... ఆ .. ప్రక్క కంపార్ట్‌మెంట్‌లో ఉన్నారు" అన్నాడు. నీ పేరేంటి నవ్వుతూ అడిగాడు లతని. నాపేరు లత, మా అన్నయ్య పేరు రాజు, మేము mumbai వెళుతున్నాము. "అంకుల్! ఈ train ఏ టైమ్‌కి mumbai వెళుతుంది?" అంది సంతోషంగా. ఆ TC కొన్ని biscuit packets తీసి లతకి, రాజుకి ఇస్తూ ఇంకా 6 గంటల పడుతుంది అన్నాడు. లత థ్యాంక్స్ చెప్పి, అంకుల్ మీరు చాలా మంచివారిలా ఉన్నారు అంది. నేను ప్రభువైన యేసుక్రీస్తు బిడ్డని ఆయన నాకు మంచితనం అనే గొప్పవరంను ఇచ్చారు. ఆయన మిమ్ములను కూడా ప్రేమించుచున్నాడు మన అందరి తప్పుల కోసం ఆయన దెబ్బలు తిన్నారు. మనందరి పాపముల నిమిత్తము తన ప్రాణం పెట్టాడు. అని ఈ విధంగా ప్రభువైన యేసుక్రీస్తుని గూర్చి చాలా విషయాలు వారికి తెలియచేస్తూ వారు ఇంటి నుండి పారిపోయి వచ్చారని వారు చేసిన తప్పును గ్రహించాలని చాలా విషయాలు చెప్పాడు TC. లత,

అంకుల్ ప్రక్కనే చేరి బాధగా ముఖం పెట్టి ఆ దేవుడికి మేమంటే ఇష్టం లేదనుకుంటా! మా అమ్మా నాన్నలు ఎప్పుడు చూసినా తిడుతూనే ఉంటారు. ఒక్కసారి కూడా మెచ్చుకోలేదు అంది. అందుకు రాజు.. "చదువురాక పోవడం మా తప్పా!" అప్పుడు TC నవ్వుతూ భలే అబ్బాయివే నువ్వు, దేవుడు ఒక్కొక్కరికి ఒక్కొక్క talent ఇస్తాడు. డబ్బు సంపాదించడమే గొప్ప అనుకుంటున్నావా? నీవు పట్టుదలతో చదువుకోకుండా డబ్బు సంపాదించాలని తల్లిదండ్రులను విడిచి దూరంగా వెళ్ళటం మంచిదికాదు. అక్కడ నీ తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ఎవరూ ప్రేమించరు. నీ తల్లిదండ్రులు తిట్టేది ప్రేమించుటలో ఒక భాగమే అంటూ వారికి fruits ఇస్తూంటే వద్దు అంకుల్ అని మోమాట పడ్డాడు రాజు, ఫర్వాలేదు తీసుకో మీరు చిన్నపిల్లలు, మీ స్థాయిలో నుండి మాత్రమే ఆలోచించగలరు. నేను మీ parents స్థానంలో నుండి కూడా ఆలోచించగలను అంటూ వెళ్ళిపోయాడు.

రాజు "ఈ TC చాలా మంచివాడిలా ఉన్నాడు" అని తనలో అనుకుంటుంటే తన తల్లిదండ్రుల ప్రేమ, కష్టం జ్ఞాపకం వచ్చి కళ్ళవెంట నీరు వచ్చింది. లత, "అన్నయ్యా ఏమైంది అని అడిగింది". రాజు, లతా మనం తప్పు చేశాం. ద్వేషంతో ఆలోచించాము కానీ ప్రేమతో ఆలోచించలేక పోయాము. ఇంటికి వెళ్లిపోదాము అని TC కొరకు ఎదురు చూస్తున్నారు.

TC రాగానే పరిగెత్తుకొని వెళ్లి రాజు "అంకుల్ మేము తిరిగి అమ్మా నాన్నల దగ్గరకి వెళ్ళిపోతాము". అప్పుడు TC రాజు భుజం మీద చెయ్యివేసి శెభాష్! మంచి నిర్ణయం తీసుకున్నావు అని కొన్ని డబ్బులు తీసి రాజూకిచ్చి next stationలో దిగి, తిరిగి వచ్చే ట్రైన్‌లో ఎక్కండి అని "ప్రేమ సందేశం" అనే bible బహుమతిగా ఇచ్చాడు. "అంకుల్ మీరు మాకు చాలా నచ్చారు. యేసుక్రీస్తు మన పాపముల కొరకు ప్రాణం పెట్టినట్లుగా, మేము చేసిన తప్పుకి మీరు ticket డబ్బులు ఇచ్చారు. ఇంతే కాకుండా మాకు చాలా help చేశారు బై అని ట్రైన్ దిగారు.

రాజు, లత ఇంటికి చేరి తల్లిదండ్రుల క్షమాపణ కోరారు. రోజు బైబిల్ చదువుతూ తల్లిదండ్రులు చెప్పే ప్రతి మాటని తమ మంచి కొరకే చెబుతున్నారని అనుకుంటూ ఉంటే అన్నీ మంచిగా అన్పించాయి. వాళ్ళు పెద్దవారై రాజు వ్యాపారవేత్తగానూ, లత మంచి డాక్టరుగానూ స్థిరపడ్డారు.

పిల్లలూ! తప్పు చేయడం పాపం కాదు గానీ తప్పు తెలిసికొని మార్పుచెందడం ఎంతో గొప్ప విషయం. ఒక చిన్న సంఘటన వారి జీవితం మీద ఎంత ప్రభావం చూపించిందో గమనించారా! ఏదో ఒక సంఘటన మీ జీవితాన్ని కూడా మార్పు చెందించాలని ఆకాంక్షిస్తూ....

–మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

- శ్రీను, నల్గొండ జిల్లా.

ప్రియమైన స్పర్శ పాఠకులకు నా జీవిత సాక్ష్యమును మీ అందరితో పంచుకునే ధన్యతను అనుగ్రహించిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు మీ అందరికి ప్రత్యేకమైన వందనములు తెలుపుకుంటున్నాను.

శ్రీను అను నేను నల్గొండ జిల్లా నూతనకల్ మండలం ముకుందాపురం అను గ్రామంలో జన్మించాను. అక్కడ వ్యవసాయం చేసుకుంటూ, దేవునిని ఎరుగక భయంకరమైన త్రాగుడు అనే వ్యసనముతో బ్రతికేవాడిని. కుటుంబములోనూ, ఊరిలో ఎవరితోనైననూ గొడవలు వచ్చినప్పుడు ఎంతమంది పైకి వచ్చినా కత్తులను, గొడ్డళ్ళను పట్టుకొని గొడవకి వెళ్ళేవాడిని. దేవునిని నమ్ముకున్న వారిని కూడా నాకు తోడుగా త్రాగడానికి తీసుకొని వెళ్ళేవాడిని. ఈ విధముగా కొన్ని దినములు జరిగిన తరువాత నేను పళ్ళు తోముకుంటుండగా నోటి లోపల చర్మం వేపపుల్లకు చుట్టుకొని వచ్చింది. అప్పుడు నేను ఎన్ని హాస్పిటల్స్‌కి తిరిగినా తగ్గలేదు. దేవున్ని నమ్ముకున్న కొందరు యేసుక్రీస్తు ఏ వ్యాధినైనా బాగుచేస్తారని చెప్పగా నమ్మి ఆ దినం మా ఊర్లో ఉన్న దేవుని ఆలయమునకు వెళ్ళడం జరిగింది. ఆ విధంగా దేవుని నమ్ముకొని ప్రార్థించగా ఆ గాయం మానిపోయింది. చేస్తున్న వ్యవసాయంలో నష్టపోయి కుటుంబ పోషణ నిమిత్తం హైదరాబాద్‌కు రావడం జరిగింది. ఇక్కడికి వచ్చినప్పుడు రోజుకి 60 రూపాయిలకు కూలిపని చేసేవాడిని. కొంచెములో కూడా దేవుని భాగము 10వ వంతు మందిరమునకు తీసుకు వెళ్ళేవాడిని. నేను హైదరాబాద్‌లో ఉంటూ ఖమ్మం జిల్లాలో ఒక చర్చికి వెళ్ళడం జరిగేది. దేవుని వాక్యానుసారముగా జీవించడం కంటే, ఆచారములకే ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవాడిని. మందిర వార్షికోత్సవములంటూ తెగ తిరుగుతూ, డబ్బు అంతా ఖర్చుపెడుతూ ఉండేవాడిని. ఈ విధంగా ఉంటూ కొన్ని అనివార్య పరిస్థితుల వలన దశమభాగం ఇవ్వడం మానివేసి, ధనాపేక్షతో భ్రష్ఠత్వం లోనికి వెళ్ళిపోయాను. అయినప్పటికి కొన్ని దినములు బాగానే గడిచిపోయాయి. కొంతకాలమైన తరువాత తెలియని బలహీనత, హృదయమంతా కలవరం, ఏ పని చేయలేని నీరసం, వీటి వలన ఎంతో కృంగిపోయి దేవునికి వ్యతిరేకముగా ఆలోచిస్తూ దేవునిని విడిచి పెట్టేద్దామనే స్థితిలోనికి వచ్చాను. నా భార్య కూలిపని చేస్తూ కుటుంబమును పోషిస్తూ ఉండేది. నేను ఆ నిరాశలో ఎలాగూ దేవునిని విడిచిపెడుతున్నాను కదా చనిపోదామని నిర్ణయించుకున్నాను. ఒకరోజు కడుపు నిండా మటన్ తిని, త్రాగి చనిపోవాలని అనుకున్నాను. ఎపఫ్రా అన్నతో గతంలో ఉన్న కొద్ది పరిచయం ద్వారా

ఒక్కసారి కలసి చనిపోదామనుకున్నాను.


నా పరిస్థితి అంతా వివరముగా చెప్పాను. మొట్టమొదటగా ఆచారముతో చేసే భక్తి మానివేసి, యథార్థముగా దేవునిని సేవించమని ఆయన నాకు సలహా ఇచ్చారు. అప్పటి వరకు ఆసక్తితో కాక, ఆచారముగా తిరుగుచూ, చేస్తున్న భక్తిని విడిచిపెట్టేశాను. అప్పటి నుండి నమ్మకముగా ఎపఫ్రా మినిస్ట్రీస్‌లో ఆదివారపు ఆరాధనలో క్రమముగా పాలు పొందుచూ, సంఘము అనే శరీరములో ఒక అవయవముగా ఉండడం నేర్చుకున్నాను.

అన్నతో మాట్లాడిన తరువాత రోజే నేను పనికి వెళ్ళడానికి కావలసిన శక్తిని దేవుడు అనుగ్రహించాడు. ఈ విధంగా దేవుడు నన్ను చక్కగా నడిపిస్తూ ఉంటే మూడవసారి కూడా ఆడపిల్లే పుట్టిందని కృంగిపోయాను. ఆ సంగతి తెలుసుకొని దైవసేవకులు మా ఇంటికి వచ్చి నన్ను ధైర్యపరిచారు.

నేను పనులు చేసుకుంటూ నెలకు 3,4 వేలు సంపాదించే వాడిని. 2007 జనవరి 26 ఉపవాస ప్రార్థన జరుగుచుండగా దైవసేవకులు ప్రసంగిస్తూ, మధ్యలో నన్ను నిలువబెట్టి చదువులేని, మట్టిపని చేసుకుంటున్న నిన్ను దేవుడు 5 అంకెల సంపాదనలోకి తీసుకు వెళ్ళగలడని నమ్ముచున్నావా? అని అడిగారు. నమ్ముచున్నాను అని చెప్పాను. ఆ తరువాత నా పరిస్థితులు అన్నీ ఊహించని విధముగా మారిపోయాయి. 2008 జనవరి ఉపవాస ప్రార్థనలో సొంత గృహములు లేనివారి కొరకు ప్రార్థించగా, నేను గృహం కట్టుకోవడానికి దేవుడు కృప చూపారు. 2 సార్లు బైక్ ప్రమాదముల నుండి కూడా కాపాడి ఎటువంటి తొందరలు కలగకుండా సహాయం చేశారు. ఒకసారి నేను చేస్తున్న పనిలో 4వ అంతస్తు నుండి రాయి నా తల మీద పడి చనిపోతాను అనుకున్న పరిస్థితులలో కూడా దేవుడు సహాయం చేసి ఈ విధంగా నిలిపి ఉంచారు.

ఆర్థిక సంబంధమైన మేలులే కాకుండా పరిచర్యలో నన్ను ప్రేమించే వారిని ఎందరినో దేవుడు అనుగ్రహించి, ఒక నమ్మకమైన పాత్రగా పరిచర్యలో జీవించడానికి కృప చూపుచున్న దేవునిలో ఎల్లప్పుడూ కృతజ్ఞత కలిగి జీవించాలనే ఆశని కలిగి ఉన్నాను. నేను, నా కుటుంబము ఆయనలో నిలిచి ఉండాలని ప్రార్థించగలరు.

# రూపాయి, యూరో, డాలర్, పౌండ్



ఇది ఏమిటా అనుకుంటున్నారా? ఈ నవ నాగరిక ప్రపంచములో మన వాళ్ళు డబ్బుకి పెట్టుకున్న పేర్లు. మన దేశములో రూపాయిగా చలామణి అయితే, మరికొన్ని దేశములలో యూరో, డాలర్, పౌండ్‌గా చెల్లుబాటు అవుతుంది. ఇంకా అనేక దేశములలో అనేక పేర్లు, ఎన్ని పేర్లు ఉన్నా అన్ని దేశములలోనూ మానవుని జీవితమంతా వాటి చుట్టూనే తిరుగుతూ ఉంది అని అనుకోవడంలో వాస్తవం లేకపోలేదు.

డబ్బు సంపాదించుకోవడం కోసం ఎత్తుకి పై ఎత్తు వేస్తూ విలువలు కాలరాస్తూ, ముందుకి దూసుకుపోతున్న సమాజం, ఆర్థికంగా ఎదిగితే చాలు అన్ని విషయములలో ఎదిగినట్లే అనుకోవడం అజ్ఞానం అవుతుంది కదా! ప్రతిదినం ఏదో విధంగా డబ్బు అవసరం ఉంటూనే ఉంటుంది. డబ్బు అవసరముల కొరకే అయితే ఫర్వాలేదు కానీ, అదే ఊపిరిగా భావించే స్థాయికి దిగజారిపోయాము. అనేకమంది జీవితములలో ప్రేమ, అప్యాయత, అనురాగం అనే వాటిని ధనవ్యామోహం అనే చెద తొలిచివేసి అవి కేవలం అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. మనం లోతుగా ఆలోచిస్తే, ఒక చక్కటి సమాజం కొరకు మంచి కుటుంబాలు అవసరం. అనేక కుటుంబాల ద్వారా మంచి సమాజం నిర్మించబడుతుంది. ఆ కుటుంబాల పునాదే ధనార్జన మీద కట్టబడితే సమాజం ఏ విధంగా ఉంటుంది?

వివాహం ద్వారా కుటుంబం ఏర్పడడానికి కేవలం ధనమే ప్రామాణికం – ఇది నేటి మాట. వ్యక్తి వ్యక్తిత్వం ఇవన్నీ ఏ మాత్రం ముఖ్యమైనవిగా భావించకపోవడం మన దిగజారుడు తనానికి నిదర్శనం. ఇంతటి ప్రాముఖ్యమైన విషయమును గురించి ప్రతి వ్యక్తికి సరియైన అవగాహన అవసరం. కొందరు తెలిసి ఈ మార్గములో ప్రయాణిస్తూ ఉంటే మరికొందరు తెలియక ముందుకి వెళ్తున్నారు.

ఈ ఆర్టికల్ యొక్క ముఖ్య ఉద్దేశ్యము ధనాపేక్ష వలన కలిగే దుష్పరిణామములను తెలియపరచాలనేదే. రాబోయే సంచికలలో మరింత వివరముగా దీని గురించి తెలుసుకుందాము.

**(ఇంకా ఉంది)**

# సిలువ విలువ

యేసును సిలువకు మేకులతో కొట్టి చంపుతూ, తమ జీవిత విధానమును ఆటంకపర్చే ఒక వ్యక్తిని చంపుతున్నామనుకున్నారు కొందరు దుర్మార్గులు. కానీ లోకారంభములోనే సిలువ దేవుని ప్రణాళిక అని వారు గ్రహించలేదు.



## 1. దేవుడు పాపములన్నింటి పరిష్కర్త

గొప్ప సృష్టికర్త అయిన దేవుడు సిలువపై తన కుమారుని మరణం ద్వారా ప్రతి వ్యక్తి పాపములను, బాధలను, దుఃఖములను పరిష్కరించాడు. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి స్థానములో యేసు మరణించాడు. ఆయన సిలువపై చేసిన కార్యములను వ్యక్తిగతంగా స్వీకరిస్తే మన అవసరతలన్నింటికి సమాధానం దొరుకుతుంది.

ఎ. సిలువ ద్వారా దేవుడు తన శక్తిని బహిర్గతం చేస్తున్నాడు.

బి. దేవుడు తన ప్రేమను సిలువపై కనపరుస్తున్నాడు.

సి. దేవుడు సిలువపై మన దుఃఖమును తొలగించాడు.

డి. సిలువపై యేసు మన పాపముల శిక్షను స్వీకరించాడు.

## 2. సిలువ ద్వారా దేవునితో నూతన సంబంధము

దేవుడు అతి పరిశుద్ధుడు, నీతిమంతుడు కనుక పాపం మనలను ఆయన నుండి వేరు చేస్తుంది. హృదయములో పాపము ఉంచుకొని ఎవ్వరూ ఆయన సన్నిధిలో నిలువలేరు. అందుచేత యేసు మన పాపముల నిమిత్తము మన స్థానంలో శిక్షగా సిలువ హింస పొందడమే కాదు మనం దేవునిని వ్యక్తిగతంగా తెలుసుకొని ఆయనతో సహవాస ఫలితంగా లభ్యమయ్యే ఆయన ప్రేమను, సమాధానమును సంతోషమును అనుభవించడం సిలువ మూలంగా సాధ్యమయ్యింది.

ఎ. సిలువ ద్వారా దేవుడు మనలను అంగీకరించాడు.

బి. సిలువ ద్వారా మనం క్షమాపణ పొందుతున్నాం.

సి. సిలువ ద్వారా మనం దేవుని కుటుంబ సభ్యులమవుతున్నాం.

డి. సిలువ ద్వారా జాతిపరమైన అడ్డుగోడలు కూలిపోయాయి.

## 3. సిలువ ద్వారా స్వాతంత్ర్యం

సిలువపై యేసు మరణం మనకు గొప్ప విజయం. ఎందుకనగా దేవుడు మన పాపములను సిలువపై పరిహరించాడు. దాని అర్థం పాపఫలమైన ప్రతి దుస్థితి, బాధ కూడా పరిహారమై పోయింది. సిలువ మనకు గొప్ప స్వాతంత్ర్యమును సంపాదించింది.

ఎ. సాతాను నుండి విడుదల.

బి. గత పాపముల నుండి విడుదల.

సి. ప్రస్తుత పాపముల నుండి విడుదల.

డి. వ్యాధి నుండి విముక్తి.

ఇ. శాపం నుండి విడుదల.

ఎఫ్. తీర్పు నుండి విడుదల.

జీ. నిత్య మరణం నుండి విడుదల.

## 4. ప్రేమా, న్యాయమూ సిలువ వద్ద కలుసుకున్నాయి

దేవుని ప్రేమ, ఆయన న్యాయ తీర్పు కలుసుకున్న స్థలం సిలువ. పాపమునకు శిక్ష రక్తమును చిందించే మరణమే అన్నది ఆయన న్యాయ తీర్పు ఆదేశం. ఆయన ఇచ్చిన ఆదేశమును ఆయన ప్రేమే తీర్చింది. దేవుని కుమారుడైన యేసు మన స్థానంలో మరణించాడు.

అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు, ఎట్లనగా మనము ఇంకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులుగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా

ఉగ్రత నుండి రక్షింపబడుదుము. ఏలయనగా శత్రువులమై యుండగా ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన యెడల సమాధానపరచబడిన వారమై, ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము!

## 5. చరిత్రకు కేంద్రం సిలువ

భూమి మీద మానవ మనుగడకు కేంద్రబిందువు యేసుక్రీస్తు సిలువ. మొట్టమొదటి స్త్రీ, పురుషులైన ఆదాము, అవ్వలు పాపం చేసిన క్షణం నుండి యేసు సిలువపై మరణించాలని దేవుడు ముందుగానే ఏర్పాటు చేశాడు. ఆ సమయం నుండి దేవుడు ప్రజల రక్షణ కొరకు సిలువపై ఏమి చేస్తానని వాగ్దానం చేశారో, దానికై ప్రజలు విశ్వాసంతో నిరీక్షించారు. ఈ రోజు సిలువలో యేసు మన కొరకు చేసిన దానిని చూచి క్షమాపణనూ, నూతన జీవితమును పొందుతున్నాము.

కాబట్టి ప్రియమైన వారలారా! ఆయన సిలువలో చేసిన త్యాగమును ప్రేమను గుర్తించి ఒక ఒప్పందమును ఈ విధంగా చేసుకోవాలి.

యేసు సిలువలో చనిపోయినప్పుడు దేవుడు నా కొరకు చేసిన దానిని నేను ఈ రోజు సంపూర్తిగా నమ్ముతున్నాను. నా పాపశిక్షను ఆయన అనుభవించాడని విశ్వసిస్తు న్నాను. దేవుడు నాకు ఇచ్చే పాపక్షమాపణను నేను గైకొంటున్నాను. దీని ద్వారా నాకు ఆయనతో కలిగిన సంబంధానికి ఆయనకు కృతజ్ఞతలు. ఇక ప్రతిరోజు దేవునితో ఈ వ్యక్తిగత సంబంధంతో జీవిస్తానని నేడు తీర్మానిస్తూ ఈ సత్యమును ఇతరులతో పంచుకుంటానని వాగ్దానం చేస్తున్నాను.

# షోమ్రోను కొండ



ఇశ్రాయేలీయులను ఒమ్రీ అను ఒక రాజు పరిపాలిస్తున్నప్పుడు షెమెరు అను వాని దగ్గర ఒక కొండను నాలుగు మణుగుల వెండికి కొని, దాని మీద తన క్రొత్త రాజధాని నగరమును కట్టించెను. షెమెరు అను పేరుని బట్టి దీనికి షోమ్రోను అను పేరు కలిగెను. షెమెరు అను పేరునకు కావలి అని అర్థము. ఈ పట్టణము కొండ మీద కట్టబడుటచే దీనికి "షోమ్రోను పర్వతము" అను పేరు కూడా కలదు. దీని చుట్టూ ఫలవంతములగు లోయలు కలవు. రాజగు ఒమ్రీ కాలము మొదలుకొని 10 గోత్రములు అష్షూరు వారిచే పట్టు బడునంత వరకు 22 సం॥లు ఇది ఆ దేశమునకు రాజధానిగా ఉండెను. ఈ కాలము నందు చనిపోయిన రాజులను ఇచ్చటనే పాతిపెట్టిరి. మొదటి నుండి విగ్రహపూజ ఈ పట్టణమున నిండుగా ఉండెను. ఆహాబు బయలు దేవతకి ఒక గుడిని కట్టించి ప్రతిష్ఠించెను. ఇతని రాణియైన యెజెబెలు 400 మంది బయలు పూజారులను పోషించెను. వీరి దుష్కార్యములను ఖండించుటకు ఏలియా ప్రవక్త బహు ప్రయాసపడెను. షోమ్రోను పట్టణమునకు ఏలియా ప్రవక్త కాలంలో గొప్ప కరువు సంభవించెను. ఎలీషా ప్రవక్త ఈ పట్టణమునందే నివసించెను. దీనికి నాశనము సంభవించునని ప్రవక్తలు అనేకమార్లు ప్రవచించిరి.

క్రొత్త నిబంధనా కాలములో సమరయ పట్టణముగా చెప్పబడిన దీనియందు సువార్తికుడగు ఫిలిప్పు దేవుని గురించి ప్రకటించెను. గారడీ వాడగు సీమోను ఈ పట్టణమునందు ఆ సమయంలో ఉండెను. పేతురు, యోహానులు దీనిని దర్శించిరి.

ప్రస్తుతము దీనిని ఎస్ సెబుస్తియె అని పిలుచుచున్నారు. ఇది ప్రస్తుత కాలమున ఒక చిన్న పల్లెయై యున్నది.




# బైబిల్ క్విజ్ -15

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ చూచుచున్నావే అని ఎవరు ఎవరితో అన్నారు?

**2.** శిష్యుల మనస్సులను దృఢపరచి-అనేక శ్రమలను అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశించాలని పలికినది ఎవరు?

**3.** దేవుడు ఎవరిచేత విశేషమైన అద్భుతములను చేయించెను? రిఫరెన్సు?

**4.** పౌలు సువార్త మొదట ఎక్కడ ప్రకటించెను?

**5.** హెర్మే, ద్యుపతి ఎవరు? వారి పేర్లు ఏమిటి?

**6.** యేసు సిలువ మరణం తర్వాత ఎన్ని దినముల వరకూ శిష్యులకు కనబడెను?

**7.** అతని యిల్లు పాడైపోవును గాక .... అతని యుద్యోగము వేరొకడు తీసుకొనును గాక అని కీర్తనల గ్రంథములో వ్రాయబడి ఉంది. ఎవరిని గూర్చి చెప్పబడింది?

**8.** అతడు విద్వాంసుడును, లేఖనముల యందు ప్రవీణుడై యుండెను ఎవరు?

**9.** అపోస్తలులు రొట్టెవిరుచుటకు ఎప్పుడు కూడుకొనిరి రిఫరెన్సు? ఏ వారము ఏ సమయం?

**10.** అపోస్తలులు ఎంతమందిని పరిచర్యకొరకు ఏర్పరచు కొనిరి?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఏప్రియల్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మే 2011 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 500 070.

**బైబిల్ క్విజ్ – 14 జవాబులు :**

1. 30 సం॥లు (లూకా 3:23)
2. బర్తిమయి, తీమయి కుమారుడు ( మార్కు 10:46)
3. పంపబడినవాడని ( యోహాను 9:7)
4. కనాను స్త్రీతో (మత్తయి 15:28)
5. మరియ(లూకా 10:42)
6. యేసు తోమాతో అనెను (యోహాను 20:27)
7. కృపయు సత్యమును(యోహాను 1:17)
8. లోపలినుండి బయలు వెళ్లునది (మార్కు 7:20)
9. 3,600 రూ॥లు (మత్తయి 18:24)
10. యోహాను (యోహాను 21:24)

**బైబిల్‌క్విజ్ – 14 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

కె.సాల్మన్‌రాజు, కృప, ఐజాక్‌కుమారి, కనికరమ్మ, జె.స్వరూప, జి.శ్యామ్‌ప్రసాద్, పి.విజయ కుమారి, జె.రాజ్యం, బి.సౌజన్య, ఎమ్.విజయ, ఎమ్.జ్యోతి, ఎమ్.శిరీష, సి.హెచ్.జానకీదేవి, వి.రాణి, రూప, కొర్నేలి.

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మార్చి - ఏప్రియల్

**భాగ్యలత** : పుష్పలత, రాజేశ్వరి, పద్మ, తిమోతి, మోజెస్, దీపిక, తేజ (మిర్యాలగూడ), పీటర్, ఏలియా, సలోమియ, రూతు, సుజాత, గీత, రాహుల్, హెప్సిబా, యోజస్వి, అభినయశ్రీ, సురేష్, కళ, నాగేష్, ప్రియాంక, పద్మ, కృపారావు, జిన్నిబాబు, ఎలీషాబాబి, కె.ఎల్.నరసింహరావు, జయ, అభిషేక్, విమలాప్రసాద్, నోహ, శేషగిరిరావు, రాజేష్, ఆషా, పర్ణిక, గ్రీష్మ, మధురిమ, జీవన్, కెజియా, నోయాగ్రేస్, శ్రీకాంత్‌రవి, పద్మాకర్, వాత్సల్య, కీనశ్విన్.

**చింతల్ :** రాజేష్, స్నేహ, శ్రీకాంత్, జయానంద్, బాలరాజు, విజయ్, రాణి, శాంతిప్రియ, రాధామణి, సూర్యదీపిక, శిరీష, సురేంద్ర, హేమకుమారి, జీవన్ కుమార్, విజయ, డేవిడ్, సుధాకర్, మైఖేల్, అనంతరావు, రాజామన్నార్, మోహన్.

**అనాజ్‌పూర్ :** ప్రభుదాస్, మారియమ్మ, కరీమున్, ఆనందరావు, ధనలక్ష్మి, శ్రావణి, రమేష్‌బాబు, పీటర్, డేవిడ్, పాల్‌రాజ్, స్వాతి, ఆరాధన, రూతు, కృపా వరుణ్.

**ఇ.సి.ఐ.యల్ :** లలితా సాల్మన్.

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

జనవరి 26, 2011 ధనుంజయ గార్టెన్స్, హైదరాబాద్‌లో జరిగిన పార్థనలో 2010 సంవత్సరమునకు గాను
ఉత్తమ ప్రతిభ కనబరిచి, బహుమతులు అందుకుంటున్న సండే స్కూల్ పిల్లలు



జనవరి 26, 2011 ధనుంజయ గార్టెన్స్, హైదరాబాద్‌లో జరిగిన
ఉపవాస ప్రార్థనలో ఆసక్తితో పాల్గొన్న సహోదర, సహోదరీలు.









# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com
web: www.epaphra.org